క్లుప్తంగా

17న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌మార్క్ గ్లోబల్ టెక్నాలజీస్‌లో జూనియర్ అకౌంటెంట్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు బీకామ్, ఎంకామ్, ఎంబీఏ, సీఏ, ఇంటర్ ఉత్తీర్ణులై, టాలీ, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో అవగాహన ఉన్న పురుష అభ్యర్థులు అర్హులని వివరించారు. మ్యాన్‌కైండ్ ఫార్మాలో మెడికల్ రిప్రజెంటేటివ్, నిట్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్, ఇండో ఎంఐఎం, హోండాయ్ మోబీస్, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి కూడా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటికి టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.13 వేల నుంచి రూ.35 వేల వరకూ జీతం, ఆయా ఉద్యోగాలను బట్టి ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకరాలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని సూచించారు. డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని లచ్చారావు తెలిపారు.

దివ్యాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ

కాకినాడ రూరల్: ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీలో 'పార్కర్ వెల్ బోర్న్ ఐటీఎస్ లిమిటెడ్' ఆర్థిక సాయంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పరికరాలు పంపిణీ చేశారు. స్థానిక వాకలపూడిలో శుక్రవారం ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హెచ్‌ఆర్ మేనేజర్ కస్తూరిరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయన మాట్లాడుతూ సొసైటీ సేవలను అభినందించారు. తమ సంస్థ సామాజిక బాధ్యత నిధులతో 90 మందికి అవసరమైన కృత్రిమ, సహాయ పరికరాలను పంపిణీ చేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా నిరంతరం దివ్యాంగులకు అవసరమైన వసతులను సమకూరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్కర్ వెల్ బోర్న్ లిమిటెడ్ టి.కరుణ, బి.అమూల్య, పి.నవీన్, కె.నారాయణ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌వీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాల వితరణ



రమణయ్యపేటలో దాత అరుణ సహకారంతో వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద దామిశెట్టి అరుణ శుక్రవారం వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వృద్ధులకు వస్త్రాలతో పాటు భోజన సదుపాయం కల్పించిన అరుణ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజరాజేశ్వరీదేవి వసంతోత్సవాలు

- పాదగయ క్షేత్రంలో 16 రోజుల పండుగ



వసంతోత్సవ అలంకరణలో స్వామి అమ్మవార్లు

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రం ఇలవేల్పు రాజరాజేశ్వరిదేవి అమ్మవారి వసంతోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. మహా శివరాత్రి, కుక్కుటేశ్వరస్వామి రాజరాజేశ్వరీదేవి అమ్మవార్ల వార్షిక కల్యాణోత్సవం ముగిసిన తరువాత నిర్వహించే 16 రోజుల పండుగ వసంతోత్సవం వేద మంత్రాలతో వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ పండుగలో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం అలంకరణ చేసారు. స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్ని అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు పలువురు భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి ప్రత్యేక చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

సంక్షేమం పునరుద్ధరణ

- కూటమి ప్రభుత్వంపై కార్మికుల నిప్పులు
- ఎన్నికల హామీ అమలు చేయాలని కార్మిక సంఘాల ఆగ్రహం

కాకినాడ సిటీ: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం, కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. కార్మికుల సహజ మరణానికి రూ.60 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు చెల్లిస్తామన్నారు. అదనంగా మట్టి ఖర్చులకు మరో రూ.30 వేలు, ఇవి కాక మహిళా కార్మికుల తొలి కాన్పునకు రూ.30 వేలు, రెండో కాన్పునకు రూ.30 వేలు చెల్లిస్తామన్నారు. ప్రమాదవశాత్తు అంగవైకల్యం ఏర్పడితే రూ.5 లక్షలు అందిస్తామన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధ కార్మికులకు పెన్షన్ రూపంలో సంక్షేమ బోర్డు ద్వారా సాయం అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. మాయమాటలతో అమలు సాధ్యం కాని హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నింటినీ చంద్రబాబు విస్మరించారని భవన నిర్మాణ కార్మికులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదు. ఫలితంగా కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు అలముకున్నాయి. ఇసుక కొరతకు తోడు నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరగడంతో ఆ ప్రభావం భవన నిర్మాణ రంగంపై పడింది. ఫలితంగా పనులు దొరక్క కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోక వేలాది మంది కష్ట జీవులు రోడ్డున పడ్డారు.



భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

ప్రమాదం జరిగితే జీవనం దుర్భరం

కార్మికుడు పని చేసే చోట ప్రమాదం జరిగితే ఆదుకునే నాథుడే కరువయ్యాడు. కాంట్రాక్టర్, భవన యజమాని ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు తప్ప ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఎవరూ కల్పించడం లేదు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఆర్థికంగా మానసికంగా ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి పాలైనా, మంచానికే పరిమితమైనా అప్పులు పాలైనా మళ్లీ వారు తేరుకోలేకపోతున్నారు.

సంక్షేమ బోర్డుతోనే భరోసా

గతంలో మాదిరిగా భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే కార్మికులకు సాయం అందేదనే అభిప్రాయాన్ని యూనియన్ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. కార్మికుడు ప్రమాదశాత్తు గాయపడినా, అనారోగ్యంతో మంచానికే పరిమితమైనా బోర్డు ద్వారా ఎంతో కొంత ఆర్థికంగా సాయమందేది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల కావస్తున్నా ఇప్పటి వరకు సంక్షేమ బోర్డు ఊసేలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు పదివేల మందికి పైగా కార్మికులు ఉన్నారు. వారంతా ప్రభుత్వం తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కాకినాడలో కార్మికశాఖ కార్యాలయం

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



ఇసుక కొరతతో పనుల్లేక కార్మికులు ఇంత వరకు బాధలు పడ్డారు. ఇప్పుడిప్పుడే ఇసుక దొరుకుతోందనుకుంటే భవన నిర్మాణ రంగ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు అందుబాటులో ఉంటే ఎవరైనా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వస్తారు. నిర్మాణాలు జోరందుకుంటాయి. నిర్మాణ రంగ పని వారికి పనులు దొరుకుతాయి. ఆ ధరలు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. గతంలో భవన నిర్మాణ రంగ కార్మికులు సంక్షేమ బోర్డు ఎత్తేసారు. గత ఎన్నికల్లో కూటమి నాయకులు బోర్డు పునరుద్ధరిస్తామని హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. తక్షణమే పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిములను పరిష్కరించాలి. గతంలో కార్మికులకు ఉన్న సంక్షేమం అమలు చేయాలి.

చెక్కల రాజ్‌కుమార్,
కార్మిక సంఘాల నాయకులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాకినాడ

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యపై కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడ జిల్లాలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కేంద్ర కార్మిక సంఘాలు సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీసీసీటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేశామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా దొడ్డిదారిన ప్రైవేటీకరణ పనులను వేగవంతం చేసిందన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీతో అప్పులు తీర్చకుండా కార్మికుల జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు దువ్వా శేషుబాబ్జీ, తాళ్లూరి రాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత గోపాలకృష్ణ మృతి

బోట్‌క్లబ్: బీజేపీ నాయకుడు నేతి గోపాలకృష్ణ శుక్రవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా, నగర ప్రధాన కార్యదర్శిగా అయన పని చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తెలిపారు. ?ఆయన మృతికి పలువురు పార్టీ నేతలు సంతాపం ప్రకటించారు.

ఎండలకు మండుతున్న రోడ్లు

- ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు

కరప: ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతుండడంతో వేసవి తాపానికి గ్రామాల్లోని ప్రజలు విలవిలలాడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నాటి ఎండకు వృద్ధులు, చిన్నారులు, మహిళలు బేజారవుతున్నారు. 36, 37 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు ఉంటున్నాయని, రోజురోజుకూ ఎండలు పెరగడంతో తట్టుకోలేక పోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నిత్యం వాహనాలు, ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే కాకినాడ–రావులపాలెం, కాకినాడ–కోటిపల్లి ప్రధాన రహదారులు జన సంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి. మధ్యాహ్నం నుంచి రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు చెట్ల నీడకు చేరి ఉపశమనం పొందుతున్నారు. ఎండలకు జడిసి శుభకార్యాలకు వెళ్లాలంటేనే భయమేస్తోందని ప్రజలు అంటున్నారు. మధ్యాహ్న సమయంలో దుకాణాలు బంద్‌చేసి, సాయంత్రం తెరుస్తున్నామని వ్యాపారస్తులు తెలిపారు.



జనసంచారం లేక బోసిగా ఉన్న కరప-రామచంద్రపురం రహదారి

ఎనిమిది గ్రామాల విలీనంపై స్పందించాలి

కాకినాడ సిటీ: జిల్లా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజల వెతలపై స్పందించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు ఎనిమిది అంశాల ఫ్లెక్సీతో నిరసన చేపట్టారు. కాకినాడలో ఎనిమిది గ్రామాల విలీన సమస్యలు, జిల్లా కేంద్రానికి కార్పొరేషన్ ఎన్నికలు, ఆర్థిక సంఘం, నిధులు, ముంపునకు గురవుతున్న కాకినాడ, సామర్లకోట హైవే కెనాల్స్, ఉప్పుటేరు ప్రక్షాళన, అనారోగ్యకర కోనోకార్పస్ వృక్షాలు తొలగింపు, కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వికేంద్రీకరణ, ప్రసూతి విభాగంలో బెడ్స్ పెంపు, ఉప్పాడ తీరంలో రక్షణగోడ, మడ అడవుల పెంపకం సంరక్షణ, సాల్ట్ భూముల్లో విమానాశ్రయం, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాదికి అన్యాయం జరగకుండా ఎంపీ సీట్ల పెంపు పర్యటనల్లో వ్యక్తిగతం కాని వినతి పత్రాల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాటు అంశాలను కోరారు.



ఎనిమిది గ్రామాల విలీనంపై స్పందించాలంటూ ఫ్లెక్సీతో నిరసన వ్యక్తం చేస్తున్న దూసర్లపూడి

వైద్య రంగంలో మార్పులను అందిపుచ్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహం

- ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ నరసింహం
- ముగిసిన ఎన్‌ఈఎల్‌ఎస్ శిక్షణ

కాకినాడ క్రైం: వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుని భావితరానికి ఈ ప్రయోజనాలను అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పేర్కొన్నారు. స్థానిక జీజీహెచ్‌లోని స్కిల్ ల్యాబ్‌లో గడచిన ఐదు రోజులుగా జరుగుతున్న నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ (ఎన్‌ఈఎల్‌ఎస్) శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ వింధ్య నోడల్ అధికారిగా వ్యవహరించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, గౌరవ అతిథులుగా మాజీ వీసీ డాక్టర్ బాబ్జీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి హాజరయ్యారు. డాక్టర్ నరసింహం మాట్లాడుతూ స్కిల్ ల్యాబ్‌లో పరికరాలు సమకూర్చడంతో పాటు కీలక శిక్షణలకు అనుగుణంగా సిద్ధం చేయడంలో డాక్టర్ విష్ణువర్ధన్ కృషి అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ వింధ్య మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన 25 మంది వైద్యులు శిక్షణలో పాల్గొన్నారన్నారు. అధునాతన వైద్య విధానాలు, శస్త్ర చికిత్సా రీతులపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అనుబంధ వైద్య విభాగాల మార్గ నిర్దేశంలో ఎన్‌ఈఎల్‌ఎస్ శిక్షణ జరిగిందని డాక్టర్ వింధ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, శిక్షణ నిచ్చిన డాక్టర్లు ప్రకాష్, సూర్యకాంత్‌తో పాటు అనస్థీషియా డాక్టర్లు అచ్యుత్, పర్వీన్, ఉమా మంజుల, అభిలాష్, లక్ష్మీనారాయణ, గైనికాలజిస్టు డాక్టర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీజయంతి



సామూహిక లక్ష్మీపూజలో పాల్గొన్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీజయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజ, 108 మంది మహిళలతో సామూహిక లక్ష్మీపూజ, 108 తామర పువ్వులతో పూజ, లక్ష్మీ హోమం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహిళలతో శాస్త్రోక్తకంగా పూజలు చేయించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కె.శ్రీరమణి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని ఈఓ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం అమ్మవారికి కామాక్షి సప్లయ్ కంపెనీ ప్రొప్రైటర్ బూడిద వాసు అన్నదానానికి అవసరమైన స్టీల్ ట్రేను బహూకరించారు. ఆయనకు ఆలయం తరపున వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.

నగరంలో హోలీ సందడి

బోట్‌క్లబ్: నగర ప్రజలు శుక్రవారం హోలీ వేడుకల్లో మునిగితేలారు. కుర్రకారు ఒకరికొకరు రంగులు చల్లుకుని వేడుక చేసుకున్నారు. దేవాలయం వీధిలో మార్వాడీలు సంప్రదాయబద్ధంగా ఈ పండగ నిర్వహించారు. కళాశాలలు వద్ద యువత ఎంతో ఉత్సాహంగా రంగునీళ్లు చల్లుకుని సందడి చేశారు. రాజస్థాన్ సంస్కృతి సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలో హోలీ వేడుకలు నిర్వహించారు. రాజస్థాన్ యువతులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని వేడుక చేసుకున్నారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ కళాశాల వద్ద హోలీ వేడుకలు నిర్వహించారు.

ధూంధాంగా 'రంగ్ ఉత్సవ్'

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాల రంగుల మయమైంది. హోలీ సందడి అంబరాన్ని తాకింది. విద్యార్థులంతా ఏకతాటిపైకి వచ్చి హోలీకి కొత్త రంగులద్దారు.

ఆర్గానిక్ రంగులను వాడి ఆదర్శంగా నిలిచారు. విద్యార్థుల హోలీ వేడుకకు యాజమాన్యం పూర్తి సహాయ సహకారాలు అందించింది. 'రంగ్ ఉత్సవ్' పేరుతో నిర్వహించిన ఈ వేడుకల్లో ఫొటో షూట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ వేడుకలు కొనసాగాయి. ధూంధాంగా నిర్వహించిన రంగ్ ఉత్సవ్ రంగుల వేడుక రంగరాయ వైద్య విద్యార్థుల ఐక్యతను చాటింది.



హోలీ వేడుకల్లో రంగరాయ వైద్య విద్యార్థుల సందడి



విద్యుత్‌నగర్‌లో హోలీ సందడి

ఐడీఏ ఆధ్వర్యంలో..

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ షటిల్ బ్యాడ్మింటన్ స్టేడియం వద్ద క్రీడాకారులు హోలీ పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ జీవితంలో పండుగల ద్వారా మనం పొందే ఆనందం, మానసిక ఆనందంగా మలచుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జామి చైతన్య, కృష్ణంరాజు, కిరణ్, శ్రీరామ్, కిషన్, శ్రీనివాస్, శ్రీకాంత్, సందీప్ పాల్గొన్నారు.

కరపలో..

కరప: మండలంలో హోలీ పండగను కులమతాలకు అతీతంగా పిల్లలు, పెద్దలు నిర్వహించారు. చిన్నారులు రంగునీళ్లను సీసాల్లో పోసుకుని వీధుల్లో తిరుగుతూ ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. పెద్దలు, మహిళలు రంగులను ముఖానికి, చేతులకు రాసుకుంటూ వసంతోత్సవాన్ని జరుపుకొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులు, చిన్నారులు రంగునీళ్లు చల్లుకుంటూ సందడి చేశారు.

రెల్లి జాతి రిజర్వేషన్ల కోసం పోరాటం

కాకినాడ సిటీ: రెల్లి కులస్తులకు ఐదు శాతం రిజర్వేషన్ల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు.

ఎస్సీ వర్గీకరణ నివేదికపై మంత్రుల కమిటీ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర రెల్లి కులస్తుల తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన గాటీ సెంటర్ రెల్లిపేటలో తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఇది చాలా మంచి నిర్ణయమని, ఎస్సీ రెల్లి జాతికి న్యాయం జరగాలంటే ఐదు శాతం రిజర్వేషన్లు సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం పైన, కమిటీపైన ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.

ఘనంగా పై డే

పిఠాపురం: ప్రముఖ విజ్ఞాన శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ పై దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పై ఆకారంలో కూర్చుని అభిమానాన్ని చాటుకున్నారు.



పై ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

ప్రకటన

నా క్లయింటు కాకినాడ జిల్లా, కాకినాడ కార్పొరేషన్, జగన్నాథపురం కాపురస్తులు **యాకల శ్రీనివాసరావు** గారి కుమారుడు **కాళేకృష్ణసాయిరామ్ యాదవ్** గారు నాకు యిచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియచేయునది ఏమనగా...

నా క్లయింటు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి అనగా, పూర్వపు తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుత కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో గల సత్యప్రసన్న నగర్, రంగయ్యనాయుడు వీధి, డోర్ నెం.16-11-5బి, కాపురస్తులు చావలి విశ్వేశ్వరరావు గారి భార్య రమణమ్మ గారికి సంబంధించిన ఆస్తి అనగా ది.07-03-2020వ తేదీన సదరు చావలి రమణమ్మ గారు పెంకె అప్పలరాజు గారి తరుపున వారి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ శ్రీ గుబ్బల రామారావు గారి కుమారుడు విజయరత్నం గారి ద్వారా దస్తావేజు నెం.1126/2020 క్రియ దస్తావేజు ద్వారా కొనుగోలు చేసిన నివేశన స్థలం వాకలపూడి గ్రామ పంచాయతీ ఏరియాలోని L.P.No.149/A, L.P.No.153/1985 నెంబర్లుగా ఆమోదించబడిన ప్లాట్లలో, ప్లాట్ నెం.75 తాలూకు చదరపు గజములు 266.66, స్థలములో తూర్పు వైపు చదరపు గజములు 120 స్థలం విక్రయించగా ఈ ప్లాట్ నెం.లోని పడమర వైపు మిగిలిన 146.66 చదరపు గజముల స్థలమును కొనుగోలు చేసి దరిమిలా సదరు చావలి రమణమ్మ గారు ది.24-03-2021వ తేదీన క్రియ దస్తావేజు నెం.1297/2021 ప్రకారం తనకు సంక్రమించిన 146.66 చదరపు గజముల స్థలములో చ.గ.80.66 స్థలమును కాకినాడ రూరల్ మండలం, వాకలపూడి వాస్తవ్యులు కోర్సాని అప్పలరాజు గారి భార్య మంగ గారికి అమ్మకము చేసియున్నారు. సదరు కోర్సాని మంగ గారికి అమ్మకం చేసిన 80.66 చ.గ. పోను మిగిలి ఉన్న 66.00 చ.గ. స్థలములో సదరు చావలి రమణమ్మ గారు వాకలపూడి గ్రామ పంచాయతీ ద్వారా భవన నిర్మాణానికి అనుమతి పొంది డోర్ నెం.2-200, అసెస్మెంట్ నెం.4320 గల ఆర్.సి.సి. భవనాన్ని నిర్మించి సదరు ఇంటికి సక్రమముగా పన్నులు చెల్లిస్తూ స్వేచ్ఛగా అనుభవిస్తున్న భవనాన్ని అమ్మ చూపగా సదరు భవనాన్ని నా క్లయింట్ కొనుగోలు చేయుటకు నిర్ణయించి కొనుగోలు ఒప్పందం చేసుకునియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి అమ్మకముపై ఎవరికి అయినను ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోగా నా క్లయింట్ వ్యక్తిగతముగా లేదా దిగువ చిరునామాలో గాని మీ వద్ద ఉన్న ఆధారములతో సంప్రదించవలెను. లేనియెడల ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి నిర్వివాద, నిష్పేచి ఆస్తిగా పరిగణించి నా క్లయింట్ కొనుగోలు చేయుదురు అని ఈ ప్రకటన ద్వారా తెలియజేస్తూ గడువు ముగిసిన తరువాత వచ్చిన ఎటువంటి అభ్యంతరములు గాని, అభ్యంతరములకు గాని నా క్లయింట్‌కు ఎటువంటి బాధ్యత లేదు అని బైండ్ చేయునని తెలియజేయడం అయినది.

షెడ్యూలు: కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌లో చేరిన వాకలపూడి గ్రామ పంచాయతీ తాలూకు సర్వే నెం.లు 215/2, 215/3, 215/6 తాలూకు భూమిలో యల్.పి.నెం.149/ఏ, 153/1985 నెంబర్లుగా అనుమతి పొందిన లేఅవుట్ ప్లాన్‌లో ప్లాట్ నెం.75లో గల 266.66 చ.గ.స్థలములో పడమర వైపు గల 146.66 చ.గ. స్థలములో విక్రయించిన 80.66 చ.గ.లు పోను మిగిలిన 66.00 చ.గ. స్థలములో, డోర్ నెం.2-200, అసెస్మెంట్ నెం.4320 గల ఆర్.సి.సి. భవనానికి హద్దులు. **తూర్పు:** దారి మార్గం **పడమర:** ఇతరులకు చెందిన ఖాళీ స్థలం **ఉత్తరం:** కోర్సాని మంగ గారికి చావలి రమణమ్మ గారు అమ్మిన ఖాళీ స్థలము **దక్షిణం:** సిమ్మెంట్ రోడ్

సదరు హద్దులు మధ్య ఉన్న 66.00 చ.గ. స్థలములో నిర్మాణం చేసిన ఆర్.సి.సి. భవనం మరియు అందుల మామూలు మార్గములు, నీటి వసరులు, యావత్తు ఫిట్టింగులు మరియు సమస్త ఈజిమెంటు హక్కులతో సహా...

ఇట్లు, **మండ రాజారెడ్డి**, B.Com., B.L., న్యాయవాది
శ్రీనిలయం, మండ వారి వీధి, గొల్లలమామిడాడ. సెల్: 94411 49822